# పన్ను తగ్గితేనే.. కొనేది

## మార్కెట్‌లో డిమాండ్, వినిమయ శక్తి పెరగాలంటే

## బడ్జెట్‌లో ఐటీకి కోతలు పెట్టాలి: బార్క్‌లేస్

న్యూఢిల్లీ, జనవరి 23: రాబోయే వార్షిక బడ్జెట్‌లో వ్యక్తిగత ఆదాయ పన్ను (ఐటీ)ను ప్రభావవంతంగా తగ్గించాలని, అప్పుడే మార్కెట్‌లో వినిమయం, డిమాండ్ పెరుగుతాయని గురువారం బార్క్‌లేస్ ఇండియా ప్రధాన ఆర్థికవేత్త ఆస్తా గుడ్వానీ అన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టబోతున్నారు. ఈ క్రమంలోనే వృద్ధికి ఊతమిచ్చే నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని గుడ్వానీ పేర్కొన్నారు. మార్కెట్‌లో డిమాండ్ అండ్ సప్లై పెరిగితే.. ప్రైవేట్ రంగంలోకి పెట్టుబడులూ పెద్ద ఎత్తున తరలివస్తాయని గుర్తుచేశారు.




### ఎక్సైజ్ సుంకం తగ్గాలి

ఇంధనంపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించినా.. వ్యక్తిగత ఆదాయానికి ఊతమిచ్చినట్టేనని, కొనుగోలు శక్తిని పెంచినట్టే అవుతుందని ఈ సందర్భంగా బార్క్‌లేస్ అభిప్రాయపడింది. ద్రవ్యోల్బణం కట్టడికీ దోహదపడుతుందన్నారు. కాగా, కొత్త పన్ను విధానాన్ని మరింత మంది పన్ను చెల్లింపుదారులు ఎంచుకునేలా ఈసారి బడ్జెట్‌లో ఆకర్షణీయ మార్పులు చేసే అవకాశాలున్నాయని బార్క్‌లేస్ అంచనా వేస్తున్నది. ఇక గత ఏడాది తెచ్చిన చివరి బడ్జెట్‌లో ఉద్యోగ ట్యాక్స్‌పేయర్స్‌కు స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.75,000లకు పెంచిన విషయం తెలిసిందే. అలాగే పెన్షనర్ల కోసం కుటుంబ పెన్షన్‌పై కొత్త పన్ను విధానం కింద మినహాయింపును రూ.25,000లకు పెంచారు.

### వృద్ధికి ఊతమివ్వాలి: పరిశ్రమ

వచ్చే బడ్జెట్‌లో వ్యక్తిగత ఆదాయ పన్ను పరిమితుల్ని పెంచాలని, ఉద్యోగ కల్పనను ప్రోత్సహించే నిర్ణయాలు తీసుకోవాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి. సులభతర వ్యాపార నిర్వహణకు అనువైన ప్రోత్సాహకాలుండాలని, అప్పుడే దేశ జీడీపీకి బలం చేకూరగలదని ఆయా రంగాలు విశ్వసిస్తున్నాయి. ఈ క్రమంలోనే బీమా రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడికి పచ్చజెండా ఊపవచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఇది 74 శాతంగా ఉన్న విషయం తెలిసిందే. ఇక 2014 నుంచి యథాతథంగానే ఉంటున్న గృహ రుణ వడ్డీ చెల్లింపులపై పన్ను మినహాయింపు పరిమితిని రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షలకు పెంచాలన్న డిమాండ్లు నిర్మాణ రంగం నుంచి వస్తున్నాయి. పెరిగిన భూమి ధరలు, నిర్మాణ వ్యయం దృష్ట్యా ఇది తప్పనిసరి అన్న వాదనలు వారి నుంచి వస్తున్నాయి.





### నిర్మాణాత్మక సంస్కరణలు రావాలి: దువ్వూరి



ఈసారి బడ్జెట్‌లో రాజకీయంగా కష్టతరమైన నిర్మాణాత్మక సంస్కరణల్ని సైతం అమలుపర్చే దిశగా మోదీ సర్కారు వెళ్లాల్సిన అవసరం ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అభిప్రాయపడ్డారు. అప్పుడే దిగాలుపడిన దేశ ఆర్థిక వృద్ధిరేటును తిరిగి ఉత్సాహపర్చవచ్చని, ఉద్యోగావకాశాల్నీ పెంచవచ్చన్నారు. 'కేంద్రంలో మూడోసారి కొలువుదీరిన మోదీ సర్కారుకు ఇది తొలి పూర్తిస్థాయి బడ్జెట్. తమ అపారమైన రాజకీయ చతురతను ఉపయోగించి నిర్మాణాత్మక సంస్కరణలు తెచ్చేందుకు కృషి చేయాలి' అన్నారు. వ్యక్తుల చేతికి మరింత నగదు అందితే వినిమయం పెరుగుతుందని.. ఇది ఉత్పత్తి, ఉద్యోగ కల్పన, వృద్ధిరేటుకు దోహదం చేయగలదన్నారు. కాబట్టి ఆ దిశగా నిర్ణయాలపై దృష్టి పెట్టాలని సూచించారు.

# మారుతి కార్ల ధరలకు రెక్కలు

## రూ.32,500 వరకు పెంచిన ఆటోమొబైల్ దిగ్గజం



న్యూఢిల్లీ, జనవరి 23: కార్ల తయారీలో అగ్రగామి సంస్థ మారుతి సుజుకీ..నూతన వాహన కొనుగోలుదారులకు షాకిచ్చింది. వచ్చే నెల 1 నుంచి అన్ని రకాల వాహన ధరలను రూ.32,500 వరకు పెంచుతున్నట్లు తాజాగా ప్రకటించింది. ఉత్పత్తి వ్యయం పెరగడంతో సంస్థపై పడుతున్న అదనపు భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా వాహన ధరలను పెంచాల్సి వచ్చిందని పేర్కొంది. ప్రస్తుతం సంస్థ రూ.3.99 లక్షల ప్రారంభ ధర కలిగిన ఆల్టో కే-10తో పాటు రూ.28.92 లక్షల గరిష్ఠ ధర కలిగిన ఇన్విక్టో మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది. సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో వాహన ధరల పెంపు ఇలా..

- కాంప్యాక్ట్ కార్ సెలేరియో రూ.32,500 వరకు పెరగనున్నది.
- ప్రీమియం మాడల్ ఇన్విక్టో రూ.30 వేల వరకు అధికంకానున్నది.
- మార్కెట్లో అత్యంత ప్రజాదరణ పొందిన వ్యాగన్-ఆర్ మాడల్ రూ.15 వేల వరకు ప్రియంకానున్నది.
- స్విఫ్ట్ మాత్రం రూ.5 వేల వరకు పెరగనున్నది.
- ఎస్‌యూవీ మాడళ్లు బ్రెజ్జా రూ.20 వేలు, గ్రాండ్ విటారా రూ.25 వేలు ప్రియంకానున్నాయి.
- ఎంట్రీ లెవల్ స్మాల్ కారు ఆల్టో కే10 రూ.19,500, ఎస్-ప్రెస్ రూ.5 వేలు పెరగనున్నది.
- ప్రీమియం కాంప్యాక్ట్ మాడల్ బాలెనో రూ.9 వేల వరకు అధికమవనుండగా, కాంప్యాక్ట్ ఎస్‌యూవీ ఫ్రాంక్స్ రూ.5,500, కాంప్యాక్ట్ సెడాన్ డిజైర్ రూ.10 వేల వరకు ప్రియంకానున్నాయి.




# నయా యాక్టివా

న్యూఢిల్లీ, జనవరి 23: దేశీయ మార్కెట్లోకి నయా యాక్టివా స్కూటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా. టెక్నాలజీ పరంగా భారీ మార్పులు చేసిన ఈ స్కూటర్‌లో సౌలభ్యంగా కూర్చోవడానికి వీలుండే విధంగా డిజైన్ చేసినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీ షోరూంలో ఈ స్కూటర్ ధర రూ.80,950గా నిర్ణయించింది. బ్లూటూత్ కనెక్టివిటీతో 4.2 ఇంచుల టీఎఫ్‌టీ డిస్‌ప్లే, నావిగేషన్, యూఎస్‌బీ టైప్-సీ చార్జింగ్ పోర్ట్ వంటి ఫీచర్స్‌తో తీర్చిదిద్దిన ఈ స్కూటర్ ఆరు రంగుల్లో లభించనున్నది. 109.51 సీసీ ఇంజిన్‌తో తయారు చేసింది.

# రూపాయి తీరు అధ్వాన్నం

- **ఆగ్నేయాసియా దేశాల్లో తీవ్రంగా నష్టపోతున్నది భారత కరెన్సీనే**
- **ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ మూడీస్**

న్యూఢిల్లీ/దావోస్/ముంబై, జనవరి 23: డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువే అత్యంత దారుణంగా పడిపోతున్నదని, దక్షిణ/ఆగ్నేయాసియా దేశాల్లో భారత కరెన్సీ తప్ప.. మరే దేశ కరెన్సీ కూడా ఇంత అధ్వాన్న రీతిలో ప్రదర్శన ఇవ్వడం లేదని ప్రముఖ గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ పేర్కొన్నది. గత రెండేండ్లలో దాదాపు 5 శాతం, ఐదేండ్ల (జనవరి 2020 నుంచి)లో ఏకంగా 20 శాతానికిపైగా నష్టపోయిందని గురువారం తెలియజేసింది. ఇకపోతే రేటింగ్ ఉన్న 23 భారతీయ సంస్థల్లో 6 మాత్రమే బలపడుతున్న డాలర్‌తో ప్రభావితమవుతున్నాయని చెప్పింది.



### ఆర్బీఐ జోక్యంతో ఇబ్బందే: రాజన్

రూపాయి విలువ క్షీణతకు కారణం డాలర్ విలువ పెరుగుతూపోతుండటమేనని, ఇలాంటప్పుడు ఆర్బీఐ జోక్యం.. భారతీయ ఎగుమతుల్ని నష్టపర్చగలదని ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. దావోస్‌లో మాట్లాడుతూ.. గృహస్తుల వినియోగ సామర్థ్యం పెరిగేలా, ఉద్యోగావకాశాలు ఏర్పడేలా భారత ప్రభుత్వాలు దృష్టి పెట్టాలన్నారు. ఇదిలాఉంటే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ గురువారం మరో 9 పైసలు పడిపోయింది. 86.44 వద్ద స్థిరపడింది.

## జడ్చర్లలో అక్షయకల్ప ప్రాసెసింగ్ ప్లాంట్

హైదరాబాద్, జనవరి 23: ఆర్గానిక్ పాల ఉత్పత్తుల తయారీ సంస్థ అక్షయకల్ప ఆర్గానిక్..జడ్చర్లలో ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నది. రూ.20 కోట్ల పెట్టుబడితో నెలకొల్పుతున్న ఈ పాల ఉత్పత్తుల ప్రాసెసింగ్ ప్లాంట్ ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నదని, ఈ ఏడాది చివరినాటికి అందుబాటులోకి రానున్నట్లు ఈ యూనిట్‌లో రోజు 40 వేల లీటర్ల పాలు ప్రాసెసింగ్ కానున్నదని కంపెనీ ఫౌండర్, సీఈవో శశి కుమార్ తెలిపారు. రాష్ట్రంలో ఆర్గానిక్ ఉత్పత్తుల విభాగాన్ని మరింత బలోపేతం చేసే ఉద్దేశంలో భాగంగా ఈ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను నెలకొల్పుతున్నట్లు, దీంతో ఈ ఏడాది కంపెనీ ఆదాయం రూ.480 కోట్లకు చేరుకుంటుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం 65కి పైగా రైతుల నుంచి పాల ఉత్పత్తులను సేకరిస్తున్నట్లు, వచ్చే మూడేండ్లలో 385కి పెంచుకోనున్నట్లు ఆయన ప్రకటించారు.

## ఎంకోర్-ఆల్కమ్ 60 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, జనవరి 23: అల్యూమినియం డోర్స్, విండోస్ తయారీ రంగంలో ఉన్న ఎంకోర్-ఆల్కమ్ తన వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. రూ.60 కోట్ల పెట్టుబడితో గుజరాత్‌లోని సూరత్ వద్ద నూతన ప్లాంట్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. 1.84 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్ తొలి ఆటో రోబోటిక్ యూనిట్ అని కంపెనీ సీఎండీ శివ కోటిరెడ్డి తెలిపారు.

## జియో నూతన ప్రీపెయిడ్ ప్లాన్లు

న్యూఢిల్లీ, జనవరి 23: టెలికం దిగ్గజం రిలయన్స్ జియో ప్రీపెయిడ్ యూజర్లకోసం కొత్తగా వాయిస్, ఎస్ఎంఎస్ ప్లాన్లను ప్రవేశపెట్టింది. టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ సూచనల మేరకు డాటా అవసరంలేని కస్టమర్ల కోసం తప్పనిసరిగా వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్‌లతో కూడిన ప్లాన్లను ప్రవేశపెట్టాలనే సూచనలకు అనుగుణంగా జియో ఈ నూతన ప్లాన్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. 84 రోజుల కాలపరిమితితో రూ.458 ప్లాన్ ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ప్లాన్‌కింద అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, వెయ్యి ఎస్ఎంఎస్‌లు, రూ. 1,958 ప్లాన్ కింద అన్‌లిమిటెడ్ వాయిస్‌కాల్స్ తోపాటు 3,600 ఎస్ఎంఎస్‌లు 365 రోజుల ప్యాక్‌ను అందిస్తున్నది.

# రిలయన్స్ డిజిటల్ ఇండియా సేల్ ఆఫర్లు

ముంబై, జనవరి 23: గణతంత్ర దినోత్సవాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రముఖ రిటైల్ దిగ్గజం రిలయన్స్ డిజిటల్..మరోసారి అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ సేల్ ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. కొనుగోలుదారులు రూ.26 వేల వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్ పొందవచ్చునని తెలిపింది. ఈ ఆఫర్లు రిలయన్స్ డిజిటల్, మై జియో స్టోర్‌తోపాటు www.reliancedigital.in లో కూడా పొందవచ్చునని సూచించింది. స్టోర్‌లో షాపింగ్ చేసేవారు పలు రకాల ఫైనాన్స్‌లను ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది. అలాగే కన్జ్యూమర్ డ్యూరబుల్ లోన్స్‌పై రూ.26 వేల వరకు క్యాష్‌బ్యాక్ పొందవచ్చును. అలాగే యూపీఐ ద్వారా లావాదేవీలు జరిపి యాక్సెసిరీస్, చిన్న పరికరాలను కొనుగోలు చేసిన వారికి రూ.1,000 వరకు డిస్కౌంట్ లభించనున్నది. ఈ ప్రత్యేక ఆఫర్లు ఈ నెల 26 వరకు మాత్రమే అందుబాటులో ఉండనున్నాయి. రూ.26,999 ప్రారంభ ధరతో ల్యాప్‌టాప్‌లు, రూ.59,990 ధరతో 4కే యూహెచ్‌డీ టీవీ, 55 ఇంచుల టీవీ రూ.27,990ని కేవలం రూ.1,990 ఈఎంఐతో కొనుగోలు చేయవచ్చునని తెలిపింది.




# రెడ్డీస్ లాభం 1,413 కోట్లు




హైదరాబాద్, జనవరి 23: రాష్ర్టానికి చెందిన ప్రముఖ ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ లాబోరేటరీస్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.1,413 కోట్ల నికర కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.1,379 కోట్ల లాభంతో పోలిస్తే కేవలం రెండు శాతం వృద్ధిని కనబరిచింది. అన్ని మార్కెట్లు ఆశించిన స్థాయిలో వృద్ధిని కనబరచడం వల్లనే ఇది సాధ్యమైందని పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.7,215 కోట్లుగా ఉన్న ఆదాయం ఈసారి రూ.8,359 కోట్లకు ఎగబాకింది. ఈ సందర్భంగా కంపెనీ కో-చైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ మాట్లాడుతూ..నూతనంగా కొనుగోలు చేసిన ఎన్ఆర్‌టీ బిజినెస్ రెండంకెల వృద్ధిని నమోదు చేసుకున్నదనని, నూతన ఔషధాలు విడుదల చేయడం, నిర్వహణ పనితీరు మెరుగుపడటం కూడా కలిసొచ్చిందన్నారు. గత త్రైమాసికంలో అమెరికా నుంచి రూ.3,383 కోట్ల ఆదాయం సమకూరినట్లు వెల్లడించింది. అలాగే భారత్‌లో విక్రయాలు రూ.1,180 కోట్ల నుంచి రూ.1,346 కోట్లకు పెరగగా, వృద్ధిపరంగా చూస్తే 14 శాతం అధికమైందన్నారు. యూరప్ నుంచి రూ.1,210 కోట్లు, అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి రూ.1,436 కోట్ల ఆదాయం సమకూరింది. మార్కెట్ ముగిసే సమయానికి కంపెనీ షేరు స్వల్పంగా తగ్గి రూ.1,289.35 వద్ద ముగిసింది.

# 'స్థానిక' ఎన్నికల్లో లబ్ధి కోసమే గ్రామసభలు

- ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు కాంగ్రెస్ కొత్తనాటకాలు
- జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు ధ్వజం
- లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని డిమాండ్



పొత్తూరులో విలేకరులతో మాట్లాడుతున్న సిద్ధం వేణు

ఇల్లంతకుంట రూరల్, జనవరి 23: 'గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేకనే కాంగ్రెస్ ప్రభుత్వం రోజుకో కొత్త నాటకానికి తెరలేపుతున్నది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం, ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు ప్రజాపాలన పేరుతో పనికిరాని గ్రామసభలు నిర్వహిస్తున్నదని' జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు ధ్వజమెత్తారు. గురువారం పొత్తూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామసభలు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారని, అసలు ఒక్కో ఊరికి ఎన్ని ఇందిరమ్మ ఇండ్లు ఇస్తారో..? ఎంత మందికి ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు ఇస్తారో చెప్పలేని పరిస్థితిలో అధికారులు ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేయాల్సి ఉండగా, కాంగ్రెస్ నాయకులు తమ వాళ్లకే సంక్షేమ పథకాలు అని బహిరంగంగానే చెపుతున్నారని దుయ్యబట్టారు. గ్రామసభలతో ప్రజలకు ఒరిగేదేమీ లేదని, ఓట్ల కోసమే నిర్వహిస్తున్నారని దుయ్యబట్టారు. గ్రామసభల్లో అధికారులను పక్కనబెట్టి కాంగ్రెస్ నాయకులే లబ్ధిదారుల పేర్లు చదవడం చూస్తేనే అర్థమవుతోందని మండిపడ్డారు. గ్రామసభల పేరుతో కాలయాపన కాదు, సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల్లో నిరుపేదలు ఎవరైతే ఉన్నారో వారిని గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మహిళలకు ఇస్తామన్న రూ.2500 హామీ ఏమైందని, గ్రామసభల్లో ఆ విషయాన్ని ప్రస్తావించడం లేదన్నారు. పోలీసు పహారా మధ్య సభలు నిర్వహిస్తున్నారని, అన్యాయంపై లబ్ధిదారులు ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని, ప్రజాపాలన అంటే ఇదేనా..?, ఇందిరమ్మ రాజ్యం ఇదేనా..? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సిద్ధం శ్రీనివాస్, పట్నం శ్రీనివాస్, గుంటి మధు, పట్నం మహేందర్, బండారి మహేశ్, ఆకుల రవి, పట్నం కరుణాకర్, గుంటి తిరుపతి, శ్రీధర్,తోడేటి సతీష్, పైడిపాల సంతోష్ ఉన్నారు.

## ఓటరు దినోత్సవానికి తరలిరావాలి



జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

కలెక్టరేట్, జనవరి 23: నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్ అనే థీమ్‌తో 25న సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కోరారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఓటరు నమోదు పెంపు, ఎథికల్ ఓటింగ్‌పై అవగాహన కల్పించేందుకు ఏటా జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవంగా వేడుకలు నిర్వహిస్తామని, ఈ ఏడాది 'నథింగ్ లైక్ ఓటింగ్.. ఐ ఓట్ ఫర్ ష్యూర్' అనే థీమ్‌తో వేడుకలు జరుగుతున్నాయని చెప్పారు. జిల్లాలోని ప్రతి బూత్ స్థాయి అధికారి పోలింగ్ స్టేషన్ పరిధిలో నూతన ఓటర్లకు ఓటర్ కార్డుల పంపిణీ, వృద్ధ ఓటర్లకు సన్మానం వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేస్తారని, ప్రతి గ్రామం, వార్డులలో ఓటర్ ప్లేడ్జ్ తీసుకోవడం జరుగుతుందన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో 25న ఉదయం 11 గంటలకు జరిగే వేడుకలకు హాజరై విజయవంతం చేయాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## మభ్య పెట్టేందుకే గ్రామ సభలు



ముస్తాబాద్‌లో మాట్లాడుతున్న నాయకులు


ముస్తాబాద్, జనవరి 23: కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేసే వీలులేక ప్రజల దృష్టిని మరల్చేందుకు, మభ్యపెట్టేందుకే గ్రామ సభలు నిర్వహిస్తున్నదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు, పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహరెడ్డి, సీనియర్ నాయకుడు రాచమడుగు సంతోష్‌రావు మండిపడ్డారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలన చేతకాక, ఇచ్చిన హామీలు అమలు చేసే దమ్ము లేక సర్వేలు, సభలు, సమావేశాల పేరుతో కాలయాపన చేస్తున్నదని ధ్వజమెత్తారు. రైతులకు రుణమాఫీ అంతంత మాత్రమే అమలు చేశారని, మహిళలకు ఇస్తానన్న నెలకు రూ.2,500, వృద్ధులకు రూ.4 వేల పింఛన్ ఏమైందని ప్రశ్నించారు. పథకాల లబ్ధిదారుల జాబితాలు ఇష్టారాజ్యంగా తయారు చేశారని ఆరోపించారు. ఎన్నో ఆశలతో గ్రామ సభలకు వచ్చిన నిరుపేదల పేర్లు లేక మనస్తాపం చెందుతూ వెనుదిరుగుతున్నారని, అధికారుల తీరును ఎండగడుతున్న ఘటనలు జరుగుతున్నాయని చెప్పారు. ఇక్కడ కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్, మాజీ సర్పంచ్ నల్ల నర్సయ్య, గూడూరి భరత్, శ్రీనివాస్, సుధాకర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ కాలేజీలో తనిఖీ

చందుర్తి,జనవరి 22: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో గురువారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వై శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో ప్రత్యేక సమావేశమయ్యారు. వచ్చే మార్చిలో నిర్వహించే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. అధ్యాపకులు కళాశాలలో 90 రోజుల ప్రణాళికలు అమలు చేసి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఇక్కడ ప్రిన్సిపాల్ కాస దేవరాజం ఉన్నారు.

## 'రాజన్న' ఆలయ ఉద్యోగులపై వేటు

- ఆలయంలో సిబ్బంది తీరుపై సామాజిక మాధ్యమంలో భక్తుల పోస్టు
- కలెక్టర్ స్పందన
- 18 మందికి స్థానచలనం



ఎక్స్ వేదికగా ఓ భక్తుడు పెట్టిన పోస్టు

వేములవాడ, జనవరి 23: రాజన్న దర్శనానికి వచ్చిన భక్తులు ఆలయంలో తాము పడ్డ ఇబ్బందులను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయగా, స్పందించిన ఉన్నతాధికారులు 18 ఉద్యోగులపై వేటు వేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. ఇటీవల ఆలయంలో అసౌకర్యాలు, ఉద్యోగులు వ్యవహరిస్తున్న తీరుపై ఓ భక్తుడు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయగా, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా స్పందించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించగా, మూడు రోజుల క్రితం 18 మంది ఉద్యోగులపై అంతర్గత బదిలీ వేటు వేశారు. ఇందులో భాగంగా ఏడుగురు జూనియర్ అసిస్టెంట్లు, ఐదుగురు రికార్డ్ అసిస్టెంట్లు, ఆరుగురు నాలుగో తరగతి ఉద్యోగులను అంతర్గతంగా బదిలీ చేస్తూ ఈవో వినోద్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, భక్తుల పట్ల ఉద్యోగులు ప్రవర్తిస్తున్న తీరుపై ఈవో వినోద్‌రెడ్డి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. భక్తులతో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు.

## 25న కలెక్టరేట్‌లో జాబ్ మేళా

కలెక్టరేట్, జనవరి 23: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు 25న కలెక్టరేట్‌లోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పనాధికారి నీల రాఘవేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ అర్హతతో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, నెలకు రూ.10 వేలు నుంచి రూ.20 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. సిరిసిల్ల ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు జరిగే మేళాకు అర్హత, ఆసక్తి కలిగిన యువత తమ బయోడేటా, స్టడీ సర్టిఫికెట్లతో హాజరుకావాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్ కోరారు. మరిన్ని వివరాలకు 9700302582, 9885346768 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.





WATCH & ENJOY RELOADED VERSION IN THEATRES

విజయవంతమైన 51వ రోజు

మల్టిప్లెక్స్ టికెట్ ధర : ~~295~~/- 150/-, ~~350~~/- 200/-

సింగిల్ స్క్రీన్స్ టికెట్ ధర : 112/-, 90/-, 55/-,




సంధ్య 70 ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 10.10,2.10,6.10,10.10
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

MYTHRI THEATRES రాజధాని 70 ఎంఎం ఎ/సి - దిల్‌సుఖ్‌నగర్ 2.15,9.00PM

PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్
PVR నెక్సస్ మాల్ - కూకట్‌పల్లి
PVR గలేరియా - పంజాగుట్ట
PVR పివిఆర్ - ఎర్రమంజిల్
PVR పివిఆర్ - మూసారంబాగ్
PVR ఐకాన్ - హైటెక్ సిటీ
PVR ATRIUM మాల్ -గచ్చిబౌలి
INOX జి.ఎస్.ఎమ్ - మదీనాగూడ
INOX అశోక ఎ/సి - వై.జంక్షన్
మీరజ్ సినిమాస్ - దిల్‌సుఖ్‌నగర్
మీరజ్ సినిమాస్ - ఐడిపిఎల్
మీరజ్ సినిమాస్ - చందానగర్
Cinépolis లూలూ మాల్ - కూకట్‌పల్లి
Cinépolis CCPL - మల్కాజ్‌గిరి
Cinépolis డి.ఎల్.ఎస్ - ఉప్పల్
Cinépolis టిఎన్‌ఆర్ ఎ/సి - కొంపల్లి
AMR ఎఎంఆర్ - మౌలాలి
AMB ఎఎంబి ఎ/సి - గచ్చిబౌలి
AAA ఎఎఎ ఎ/సి - అమీర్‌పేట్
MOVIETIME ప్లాటినమ్ - అమీర్‌పేట్
MOVIETIME స్కైమాల్ - సనత్‌నగర్
GPR జిపిఆర్ - కూకట్‌పల్లి
AMR ఎఎంఆర్ ఎ/సి - మౌలాలి
ASIAN ఎంక్యూబ్ ఎ/సి - అత్తాపూర్
ASIAN సినీస్క్వేర్ - ఉప్పల్
ASIAN ఎం.జె.ఆర్-నారపల్లి
లక్ష్మీకళ ఎ/సి - మూసాపేట్
MOVIETIME యస్‌ఎల్‌టి - గచ్చిబౌలి
TIVOLI టివోలి - సికింద్రాబాద్
అపర్ణ సినిమాస్ - నల్లగండ్ల
JP జెపి ఎ/సి - చందానగర్
ASIAN cinemart సినీమార్ట్ - ఆర్.సి.పురం

పివిఆర్‌యస్2 - వరంగల్, సాయిరాం - ఖమ్మం, MYTHRI THEATRES వెంకటేశ్వర - కరీంనగర్, పివిఆర్ వేణు - నిజామాబాద్, వెంకటేశ్వర - మంచిర్యాల, పివిఆర్ జీవన్‌రెడ్డి - ఆర్మూర్, రంగ - కోదాడ, దర్శన్ - కామారెడ్డి, సితార - సంగారెడ్డి, మహేశ్వరి - జహీరాబాద్,సాయిబాలాజీ - సత్తుపల్లి

హిందీ వెర్షన్

Cinépolis మంత్రామాల్ - అత్తాపూర్
Cinépolis సుధ - శాలిబండ
INOX ఎం.పి.మాల్ - కాచిగూడ
INOX ఐనాక్స్ - బంజారాహిల్స్
INOX సత్యనెక్లిస్ మాల్స్ ఎ/సి - కవాడిగూడ
MYTHRI MOVIE DISTRIBUTORS LLP